సాక్షి
వరంగల్

ఆదివారం । 29 । జూన్ । 2025



బీసీలపై చిన్నచూపు

బీసీలపై అన్ని రాజకీయ పార్టీలు చిన్నచూపు చూస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. - 8లో▸



పీవీ విప్లవాత్మక సంస్కరణలు

భారత ఆర్థిక వ్యవస్థలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైద్యాధికారులకు సమ్మె నోటీసు అందజేత



గీసుకొండ: దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మె సందర్భంగా ఆ రోజు తాము విధులకు హాజరు కావడం లేదంటూ ఏఐటీయూసీ నాయకులు శనివారం నర్సంపేట, వర్ధన్నపేట డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ ఐ.ప్రకాశ్, డాక్టర్ కొమురయ్యకు సమ్మె నోటీసు అందజేశారు. సార్వత్రిక సమ్మెలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొంటారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్, ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేశ్‌ఖన్నా తెలిపారు. ప్రభుత్వం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. యూనియన్ ఉపాధ్యక్షుడు ఆచంట అభిషేక్, జిల్లా అధ్యక్షులు జన్ను కొర్నేలు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు యాకూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాల ఆలయ ఆదాయం రూ.8.39 లక్షలు



గీసుకొండ: మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఈ ఏడాది ఏప్రిల్ 9 నుంచి 80 రోజులపాటు రూ.8,39,225 ఆదాయం సమకూరిందని ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. శనివారం ఆలయంలో లెక్కించగా హుండీల ద్వారా రూ.2,44,200, పలు రకాల ఆర్జిత సేవల ద్వారా రూ.5,95,025 ఆదాయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకుడిగా డి.అనిల్‌కుమార్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, అర్చకులు కాండూరి రామాచార్యులు, విష్ణు, ఫణీంద్ర, ఆలయ ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ వీరాటి లింగారెడ్డి, శ్రీరాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



రాయపర్తి: నకిలీ విత్తనాలు అమ్మితే కేసులతోపాటు కఠిన చర్యలు తప్పవని రెండో అదనపు న్యాయ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి హారిక హెచ్చరించారు. విత్తనాల ఎంపిక, కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులు, విత్తన డీలర్లకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు గ్రామాల్లో అమ్ముతున్న ప్రభుత్వ నిషేధిత పత్తి విత్తనాలను కొనుగోలు చేయవద్దని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సులో లీగల్ అడ్వయిజర్ రజిని, వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాస్,ఎస్సై ముత్యం రాజేందర్, ఏఓ గుమ్మడి వీరభద్రం,ఏఈఓలు,రైతులు,డీలర్లు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



వర్ధన్నపేట: గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటన వర్ధన్నపేటలో జరిగింది. ఎస్సై చందర్ కథనం ప్రకారం.. వర్ధన్నపేటలోని వరంగల్ ఖమ్మం రహదారిలో ఉన్న ఓ స్కూల్ వద్ద శనివారం తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా పల్సర్ బైక్‌పై గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీ చేశారు. రూ.1,36,000 విలువైన రెండు కిలోల 720 గ్రాముల గంజాయి, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఖమ్మం జిల్లా ముస్తాఫానగర్‌కు చెందిన నిందితులు అఫ్రోజ్, మహేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చందర్ తెలిపారు.

పెళ్లిలో విగ్రహం ఓ ఎమోషన్

ఐనవోలు: మండల కేంద్రానికి చెందిన వడిచర్ల శ్రీనివాస్–అనురాధ దంపతుల కుమారుడు కమల్‌హాసన్, కూతురు శివాని. శ్రీనివాస్ టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. సమాజ సేవంటే ఇష్టపడే శ్రీనివాస్ ఎంపీటీసీగా పని చేశారు. గతేడాది జనవరి 22న అనారోగ్య కారణాలతో ఆయన మృతి చెందాడు. కమల్ హాసన్ నాన్న నిర్ణయం మేరకు డిగ్రీ తర్వాత లండన్‌కు వెళ్లారు. తండ్రి చనిపోయిన తర్వాత ఆయన కోరిక మేరకు చెల్లి పెళ్లి జరిపించాడు. ఆపెళ్లిలో అతడి తండ్రి ఫైబర్ విగ్రహాన్ని తయారు చేయించి నాన్నతో తనకున్న ఎమోషన్‌ను అందరికి చూపించాడు. ఈసారి లండన్ నుంచి ఇండియాకు వచ్చినపుడు ఆ ఫైబర్ విగ్రహాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేయించనున్నట్లు కమలహాసన్ తెలిపారు.



వడిచర్ల శ్రీనివాస్ ఫైబర్ విగ్రహంతో ఆయన కుటుంబ సభ్యులు (ఫైల్)

ఇంటి దేవతకు గుడి

ఖానాపురం: బుధరావుపేట గ్రామానికి చెందిన ఏనుగుతల వెంకటనారాయణ–సుజాత దంపతులది మధ్య తరగతి కుటుంబం. వీరికి ఒక కుమారుడు శ్రావణ్‌కుమార్. సుజాత 2023 జూన్ 6న గుండెపోటుతో మృతి చెందింది. దీంతో ఆమెకు గుర్తుగా గ్రామ శివారులోని పంటపొలం వద్ద కుమారుడు, భర్త కలిసి విగ్రహం ఏర్పాటు చేశారు. ఆమెకు గుడి కట్టించారు. ఇంటి దేవతను మరిచిపోకుండా ఉండేందుకు 2024 జూలైలో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె కుటుంబీకులు చెబుతున్నారు.



తల్లి సుజాత విగ్రహం వద్ద కుమారుడి కుటుంబం



నాన్న ప్రతిరూపానికి కోవెల

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన ఓర్సు శ్రీకాంత్‌కు అతడి నాన్న రవి అంటే ప్రాణం. కుటుంబ బాధ్యతలు మోసే క్రమంలో రవి అప్పుల బాధతో గతేడాది ఏప్రిల్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ బాధను దిగమింగుకుని ఆయన ప్రతిరూపాన్ని రోజూ చూడాలని శ్రీకాంత్ తన వ్యవసాయ భూమిలో రూ. 3.50 లక్షలు వెచ్చించి గుడి నిర్మించాడు. భవిష్యత్ తరాలకు తండ్రి గొప్పదనాన్ని చాటిచెప్పేందుకు.. నాన్న ప్రతి రూపాన్ని గుండెల్లో దాచుకునేందుకు గుడిని కట్టినట్లు శ్రీకాంత్ చెబుతున్నాడు.

అనుబంధాల.. ప్రతిరూపం

గతించినా.. ఎప్పుడూ గుర్తుండేలా ఏర్పాటు

ఉమ్మడి జిల్లాలో ఆలయాలు నిర్మించి విగ్రహాల ప్రతిష్ఠాపన

- శుభకార్యాల్లో మనిషిని పోలిన ఫైబర్ బొమ్మలు
- జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్న ఆత్మీయులు

గతించిన కాలాన్ని తీసుకురాలేం. వెళ్లిపోయిన మనుషులనూ పట్టుకురాలేం. వివిధ రూపాల్లో వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకోవడమొక్కటే మార్గం. కుటుంబానికి దూరమైన వారిని చిరకాలం గుర్తు పెట్టుకునేలా కొందరు అచ్చుగుద్దినట్లు విగ్రహాలు తయారు చేయిస్తున్నారు. కొన్నిచోట్ల ఆ విగ్రహాలకు ఆలయాలు నిర్మించి పూజలు చేస్తున్నారు. శుభకార్యాలైతే ఫైబర్ బొమ్మలు పెట్టుకుని మరీ ఫ్యామిలీ ఫొటోలు తీసుకుంటున్నారు. అనుబంధాల్ని పెనవేసుకుంటున్న ఆ విగ్రహాల కథే ఈ వారం 'సాక్షి' సండే స్పెషల్.

సండే స్పెషల్

కల్యాణి కట్టించిన గుడి



కుమారులు దూరమై.. విగ్రహాల్లో కొలువై

కొడకండ్ల: అల్లారుముద్దుగా పెంచుకున్న ఇద్దరు కుమారులు రోడ్డు ప్రమాదంలో దూరమయ్యారు. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని వారి జ్ఞాపకాల్ని నెమరు వేసుకుంటూ ఆ తల్లిదండ్రులు కాలం వెళ్లదీస్తున్నారు. ప్రాణం పోయిన వారి కుమారులకు విగ్రహాల రూపంలో ప్రాణం పోసి కళ్లారా చూస్తున్నారు. కొడకండ్ల మండలం రామవరం గ్రామానికి చెందిన మేటి రాములు–రాజేశ్వరి దంపతులకు ముగ్గురు కుమారులు. వ్యవసాయమే జీవనాధారమైన వారు కుమారులను చిన్నప్పటి నుంచి ప్రైవేట్ పాఠశాలల్లోనే చదివించారు. తల్లిదండ్రుల శ్రమను గుర్తించిన వారు ప్రయోజకులయ్యారు. పెద్దకుమారుడు అరవింద్, రెండో కుమారుడు శ్రవణ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా హైదరాబాద్‌లో మూడో కుమారుడు శ్రవణ్ వరంగల్ ఎంజీఎంలో హౌస్ సర్జన్‌గా పనిచేసేవారు. గత సంవత్సరం మే 19న శివ హైదరాబాద్‌లోని అన్న శ్రవణ్ వద్దకు వెళ్లాడు. భోజనం తెచ్చుకునేందుకు బయటికి వెళ్లిన ఇద్దరు సోదరులను స్కార్పియో కారు ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడిక్కడే మృతి చెందారు. కుమారులను గుర్తు చేసుకుంటూ తమ వ్యవసాయ భూమిలో గదిని నిర్మించి శ్రవణ్, శివ విగ్రహాలను ఏర్పాటు చేయించారు. మే 19న ప్రథమ వర్ధంతి సందర్భంగా తల్లిదండ్రులు ఆవిష్కరించుకున్నారు.



మేటి శ్రవణ్, శివ విగ్రహాలు

ఎల్లప్పుడూ కళ్ల ముందే ఉండాలని..

డోర్నకల్: కంటికి రెప్పలా చూసుకునే భర్త, అమ్మా అమ్మా అంటూ రోజుకు వెయ్యిసార్లు పలకరించే కుమారుడు అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో దిక్కుతోచని స్థితికి చేరుకున్న ఓ మహిళ తన భర్త, కుమారుడిని విగ్రహాల రూపంలో చూసుకుంటూ వారి జ్ఞాపకాలను నెమరువేసుకుంటుంది. డోర్నకల్ మండలం దుబ్బతండాకు చెందిన అజ్మీర బాల్యా, భారతి దంపతులకు సాయికుమార్ ఏకైక కుమారుడు. భారతి దుబ్బతండా సర్పంచ్‌గా పని చేసి భర్త బాల్యా సహకారంతో గ్రామాభివృద్ధిలో తమ వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించింది. బాల్యా, భారతి వ్యవసాయం చేస్తుండగా కుమారుడు ఖమ్మంలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఈనెల 5న కుమారుడు సాయికుమార్‌ను కళాశాలకు పంపేందుకు బాల్యా ద్విచక్ర వాహనంపై ఖమ్మం బయల్దేరగా ఖమ్మంలో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని బాల్యా, సాయికుమార్ మృతి చెందారు. వారిని మర్చిపోలేని భారతి.. బాల్యా, సాయికుమార్ విగ్రహాలను గ్రామ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసింది. జూన్ 15న వారి సంతాప సభలోబాల్యా సాయికుమార్ విగ్రహాలను ఆవిష్కరించారు.



దుబ్బతండాలో ఏర్పాటు చేసిన బాల్యా, సాయికుమార్ విగ్రహాలు

భర్త జ్ఞాపకాలతో..

మహబూబాబాద్ రూరల్: కట్టుకున్న భర్తను ప్రాణంగా భావించి ఆయన మృతి అనంతరం పాలరాతితో విగ్రహం చేయించి ఓ భార్య ఆయనకు గుడి కట్టించింది. మహబూబాబాద్ మండలం సోమ్లా తండా గ్రామానికి చెందిన బానోత్ కల్యాణి ఎంపీటీసీగా పనిచేసింది. హరిబాబుతో ఆమెకు 1996లో వివాహం కాగా.. 2021లో హరిబాబు అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనతోపాటే తాను చనిపోదామని కల్యాణి ప్రయత్నించినా బంధువులు ధైర్యం చెప్పడంతో హరిబాబు జ్ఞాపకాలతో జీవిస్తోంది. ఈక్రమంలో రూ.5.30 లక్షలతో పండుగ వాతావరణంలో గతేడాది ఏప్రిల్ 23న గుడి ప్రారంభించింది. ప్రతీ శనివారం ఆయనకు పూజలు చేస్తోంది.



హరిబాబు విగ్రహం వద్ద కల్యాణి

వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్‌పై వేటు

డీజీపీ కార్యాలయానికి అటాచ్డ్

- ఆయన స్థానంలో ఎన్.శుభంప్రకాశ్ నియామకం.. బాధ్యతల స్వీకరణ

సాక్షి, వరంగల్: వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్‌పై వేటు పడింది. కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళికి వివిధ సందర్భాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎస్కార్ట్ కల్పించి మెమోలు అందుకున్నారు. కాంగ్రెస్ నేత నవీన్‌రాజ్‌కు ఏ పదవి లేకున్నా కూడా పోలీసు భద్రత కల్పించి వివాదాల్లో చిక్కుకున్నారు. మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో కూడా పాల్గొన్న ఆయన తరచూ వివాదాలకు కేంద్రబిందువుగా మారిన సందర్భాలున్నాయి. కేవలం 15నెలల పాటు పనిచేసిన నందిరాంనాయక్‌ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎక్కడ కూడా పోస్టింగ్ ఇవ్వకపోవడం గమనార్హం. ఆ స్థానంలో 2022 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఎన్.శుభంప్రకాశ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. శుభంప్రకాశ్ 2024లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఆరు నెలలపాటు ట్రైయినీ ఐపీఎస్‌గా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం కరీంనగర్ రూరల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా పనిచేస్తున్నారు. ఏసీపీగా రానున్న ఆయనకు వరంగల్‌పై కొంత అవగాహన ఉంది. దీంతో శాంతిభద్రతల పరిరక్షణలో కఠినంగానే ఉండే అవకాశముంది. కాగా, ఆయన సాయంత్రం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ డివిజన్ పోలీసులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



ఏసీపీ శుభంప్రకాశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వరంగల్ డివిజన్ పోలీసులు

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపికలు

న్యూశాయంపేట: స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఈనెల 24, 25 తేదీల్లో ఓ సిటీలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పది మంది బాలురు, పది మంది బాలికలు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని జిల్లా యువజన క్రీడాశాఖాధికారి సత్యవాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు వచ్చేనెల 2, 3వ తేదీల్లో హకీంపేట క్రీడా పాఠశాలల్లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

క్రీడాకారులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వరంగల్ ఓ సిటీలోని క్రీడాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఎంపికైన బాలుర వివరాలు..

బి.మోక్షిత్ (నెక్కొండ), జి.బాలాజీ (ఖిలా వరంగల్) టి.వేణుగోపాలాచారి (వరంగల్), వి.త్రిలోక్ (ఖిలా వరంగల్), జి.విశ్వతేజ్ (వరంగల్), ఎస్.నయన్ (వరంగల్), ఐ.ఈసాక్‌పాల్ (రాయపర్తి), సీహెచ్.హన్సిత్‌తేజ, కె.చెరితేజ్ (రాయపర్తి), ఎ.రేవంత్ (రాయపర్తి) ఎంపికయ్యారు.

ఎంపికైన బాలికలు..

ఎ.రెయోనాగ్రేస్ (ఖిలా వరంగల్), ఇ.ప్రజ్ఞశ్రీ (వర్ధన్నపేట, సీహెచ్.మోక్ష (దుగ్గొండి), జి.అశ్విక (రాయపర్తి), బి.సితార (నల్లబెల్లి), వి.చైత్రిక (సంగెం), కె.అర్చన(రాయపర్తి), బి.నౌమిక (పర్వతగిరి), జె.సాయివిన్సిక (పర్వతగిరి), ఎల్.లక్ష్మీప్రియ(రాయపర్తి) ఎంపికయ్యారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం జాతీయ ఆహార భద్రత, పోషణ్ మిషన్ ఆధ్వర్యంలో పప్పు దినుసుల విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. అలాగే, కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం (భద్రత కిట్) అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాలతో రైతులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి కె.అనురాధ, సహాయ వ్యవసాయ సంచాలకులు కె.దామోదర్‌రెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, జాతీయ ఆహార భద్రత కన్సల్టెంట్ పి.సారంగం, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు, పాల్గొన్నారు.



రైతుకు కంది మినీ కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే

ఆస్పత్రుల్లో వసతుల కల్పనకు కృషి

- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ

నర్సంపేట రూరల్: ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు వైద్య కళాశాలల్లో ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వానికి నివేదించనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ అన్నారు. శనివారం నర్సంపేటలోని వైద్య కళాశాల, జిల్లా ఆస్పత్రిని కలెక్టర్ డాక్టర్ సత్యశారద, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్, వివిధ విభాగాధిపతులతో శనివారం సమీక్ష నిర్వహించారు. వైద్య కళాశాలలో బోధన, బోధనేతర, ల్యాబ్, సిబ్బంది, కావాల్సిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య విద్యార్థినుల వసతి గృహాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆస్పత్రికి సంబంధించి ఓపీ విభాగం, ఆరోగ్యశ్రీ తదితర విభాగాలను సందర్శించారు. వివిధ విభాగాల్లో వనరుల కొరత, యూజీ మెడికల్ ఎడ్యుకేషన్, ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం ఉండాల్సిన, సమకూర్చాల్సిన సౌకర్యాలపై క్షుణ్ణంగా చర్చించారు. ఆస్పత్రికి, వైద్య కళాశాలకు డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్, శానిటేషన్ సిబ్బంది, ఇతర పరికాలపై అడిగి తెలుసుకున్నారు. ఐపీ సేవలు తర్వితగతిన ప్రారంభించాలని, వాటికి కావాల్సి వసతుల కల్పనకు కలెక్టర్ కృషి చేస్తారని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి సాంబశివరావు, టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.కిషన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రీదేవి, పలు విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ



ఆస్పత్రిని పరిశీలిస్తున్న కమిషనర్ సంగీత సత్యనారాయణ

కుల్లా, నిత్యక్లిన్నా క్రమాల్లో శ్రీభద్రకాళి

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం అమ్మవారిని కుల్లాక్రమంలో, నిత్యక్లిన్నా క్రమంలో పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయంనుంచి సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, చతుఃస్థానార్చన నిర్వహించారు. అనంతరం కాళీక్రమాన్ని అనుసరించి స్నపనభేరానికి కుల్లాగా పూజలు నిర్వహించి, వారాహి అమ్మవారిగా అలంకరించారు. షోడశీక్రమాన్ని అనుసరించి స్నపనమందిరంలోని భోగభేరాన్ని నిత్యక్లిన్నాగా అలంకరించి పూజలు జరిపారు. ఈఓ శేషభారతి పర్యవేక్షించారు.



వారాహిగా స్నపనభేరానికి అలంకరణ



నిత్యక్లిన్నాగా భోగభేరానికి అమ్మవారు

ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ దాడి



మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎనగందుల శ్రవణ్

వర్ధన్నపేట: ఎమర్జెన్సీ పేరుతో కాంగ్రెస్ పార్టీ భారత ప్రజాస్వామ్యంపై దాడి చేసి 50 సంవత్సరాలు పూర్తయిందని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎనగందుల శ్రవణ్ అన్నారు. బీజేవైఎం నాయకులు శనివారం వర్ధన్నపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని తుడిచి వేయడమే లక్ష్యంగా ఆ రోజుల్లో ఇందిరాగాంధీ పనిచేశారని పేర్కొన్నారు. సమావేశంలో భారతీయ జనతా యువమోర్చా మండల కన్వీనర్ పెండోట మహంత్, నాయకులు సంతోష్, మణి, మణిదీప్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి

నర్సంపేట: విద్యుత్ వినియోగదారులు, రైతులు తమ పరిధిలోని ఉన్న విద్యుత్ సమస్యలను సెక్షన్ ఆఫీసర్ (అసిస్టెంట్ ఇంజనీర్ ఆపరేషన్), గ్రామస్థాయిలో ఉండే లైన్‌మెన్‌కు తెలియజేయాలని వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గౌతంరెడ్డి సూచించారు. ఈ మేరకు నర్సంపేట డివిజన్ పరిధిలోని 33కేవీ లైన్‌ను శనివారం ఉపయోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని సూచించారు. భారీ వర్షాలు, గాలి దుమారంతో విద్యుత్ తీగలు తెగి పడితే వెంటనే సమాచారాన్ని ఏఈలకు తెలియజేయాలని కోరారు. తడిగా ఉన్న స్తంభాలను ముట్టుకోకూడదన్నారు. విద్యుత్ ప్రమాదాలపై అత్యంత జాగ్రత్త వహించాలని, ఇంటిలోకి వచ్చే సర్వీస్ వైరు ఎలాంటి అతుకులు లేకుండా, ఇనుప రేకుల గుండా వెళ్లకుండా చూడాలని తెలిపారు. ఇళ్లలో నాణ్యమైన వైరింగ్ వాడాలని, రైతులు స్విచ్ బోర్డు, మోటార్ స్టార్టర్ల వద్ద భద్రతా ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించాలని సూచించారు. రైతులు, వినియోగదారులు స్వయంగా కరెంటు పనులను చేసుకోకూడదని పేర్కొన్నారు. ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తినా టీజీ ఎన్పీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబర్ 1912కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో వరంగల్ డీఈ టెక్నికల్ ఎ.ఆనంద్, నర్సంపేట డీఈ పి.తిరుపతి, ఏడీలు, ఏఈ, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ లైన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

క్లుప్తంగా

ఆర్థిక వ్యవస్థలో పీవీ విప్లవాత్మక సంస్కరణలు



హన్మకొండ: భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలకు బీజం వేసి కుంటుపడుతున్న ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత మాజీ ప్రధాని పి.వి.నరసింహారావుకే దక్కుతుందని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు 104వ జయంతి నిర్వహించారు. ముందు పి.వి. చిత్రపటానికి సీఎండీ, డైరెక్టర్లు, అధికారులు, ఉద్యోగులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సరళీకృత ఆర్థిక విధానాల అమలు ఫలితంగా దేశంలో ఉద్యోగావకాశాలు పెరిగాయన్నారు. పీవీ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధాన మంత్రిగా ఆ పదవులకే వన్నె తీసుకొచ్చారన్నారు. దేశ పురోగాభివృద్ధికి పీవీ ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్ రావు, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్లు టి.సదర్‌లాల్, బి.అశోక్ కుమార్, కె.తిరుమల్ రావు, రాజు చౌహాన్, రవీంద్రనాథ్, అశోక్, వెంకటరమణ, ఆర్.చరణ్ దాస్, మాధవ్ రావు, జాయింట్ సెక్రటరీ కె.రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

5,6 తేదీల్లో ఓపెన్ టు ఆల్ చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో జూలై 5,6 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ చెస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి. కన్నా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్ సమీపం టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించే పోటీలకు ఆసక్తి గల క్రీడాకారులు జూలై 4వ తేదీ సాయంత్రంలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట చెస్ బోర్డు తెచ్చుకోవాలని సూచించారు. ఇందులో గెలుపొందిన నలుగురిని జూలై 11, 12, 13 తేదీల్లో ఖమ్మంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

సమన్వయంతో సీజనల్ వ్యాధుల నియంత్రణ

- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఎస్.సంగీత సత్యనారాయణ

హన్మకొండ: జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు సంబంధిత ప్రభుత్వ విభాగాలతో సమన్వయంతో పని చేస్తూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఎస్.సంగీత సత్యనారాయణ సూచించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులతో సీజనల్ వ్యాధులు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ముందుగా జిల్లాల వారీగా నమోదవుతున్న మలేరియా, డెంగీ, ఇతర వ్యాధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వరంగల్ జిల్లా వైద్యారోగ శాఖాధికారి, సంబంధిత అధికారులు ఎంజీఎంలో నమోదవుతున్న మలేరియా, డెంగీ పాజిటివ్ కేసుల వివరాలను డీఎంహెచ్ఓలకు అందించాలన్నారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో హెచ్ఎంలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులు, ముఖ్యంగా చేతుల శుభ్రత, ఓఆర్ఎస్ ద్రావణం తయారీ విధానం, జ్వరాలు, డయేరియాకు



మాట్లాడుతున్న రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ

సంబంధించిన ప్రమాదకర లక్షణాల గురించి అవగాహన కల్పించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఈ కార్యక్రమాల గురించి ప్రచారం చేయాలన్నారు. ప్రతీ మంగళవారం ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాలలో నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా నిర్వహించాలని, ఆశలు, ఏఎన్ఎంలకు అవసరమైన సూచనలు చేయాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బాలికల లింగ నిష్పత్తి చాలా తక్కువ ఉందని, ఈ దిశగా డీఎంహెచ్ఓలు బాధ్యతగా తగిన చర్యలు చేపట్టాలని, లింగ నిర్ధారణ పరీక్షలపై నిఘా పెంచాలన్నారు. లింగ వివక్షతపై అవగాహన కల్పించాలన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఎక్స్‌రే పరీక్షలు అవసరం వారికి ఆర్.బి.ఎస్.కె వాహనం ద్వారా అందుబాటులో ఉన్న సెంటర్లకు తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించాలన్నారు. మేనరికపు వివాహాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. హనుమకొండ, వరంగల్, ములుగు, జనగామ, మహబూబాబాద్ జిల్లాల డీఎంహెచ్ఓలు ఎ.అప్పయ్య, బి.సాంబశివరావు, గోపాల్ రావు, మల్లికార్జున్, రవి రాథోడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

బీసీలపై రాజకీయ పార్టీల చిన్నచూపు

- 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే ఎన్నికలకు పోవాలి
- బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

కాజీపేట రూరల్ : బీసీలను అన్ని రాజకీయ పార్టీలు చిన్న చూపు చూస్తున్నాయని, జనాభా దామాషా ప్రకారం బీసీలకు వాటా ఇచ్చే వరకూ అవిశ్రాంత పోరాటం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ వైష్ణవిగ్రాండ్ హోటల్‌లో శనివారం బీసీ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ అధ్యక్షతన 'స్థానిక సంస్థల ఎన్నికలు–బీసీల రిజర్వేషన్ల పెంపు' అనే అంశం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు లేకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. నెల రోజుల్లో రిజర్వేషన్లు నిర్ణయించి ఎన్నికల సంఘానికి నివేదించాలని హైకోర్టు ఆదేశించిన ప్రభుత్వం ఇంకా చర్యలు చేపట్టడం లేదన్నారు. బీజేపీ నాయకులు గల్లీలో ఒక మాట, ఢిల్లీలో మరోమాటతో బీసీలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ బీసీల వ్యతిరేక పార్టీ అని, కాంగ్రెస్, బీజేపీ మాత్రమే రిజర్వేషన్లు తేల్చాలని డిమాండ్ చేశారు. 48 గంటల్లోగా సీఎం రేవం



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

త్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని డైవర్ట్ చేయడానికి ఎమ్మెల్సీ కవిత బీసీ నినాదం ఎత్తుకున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని బీసీ రిజర్వేషన్ల అంశం ఇప్పుడు గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్పించి 42 శాతం బీసీ బిల్లు ఆమోదింపజేయాలని, లేనిపక్షంలో తెలంగాణలో బీజేపీని మట్టి కరిపిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్యయాదవ్, బీసీ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు డాక్టర్ చిర్ర రాజు, తమ్మేలా శోభారాణి, మాదం పద్మజాదేవి, కాసగాని అశోక్‌గౌడ్, డాక్టర్ సంగాని మల్లేశ్వర్, మేముల మహేందర్, వల్లాల జగన్‌గౌడ్, పంజాల మధు, తెల్ల కిశోర్, తెల్ల సుగుణ, బూర్గుల ప్రమాద, బాబుయాదవ్ పాల్గొన్నారు.

పచ్చళ్ల తయారీ కేంద్రాలపై దాడులు

- రూ.18.29 లక్షల విలువైన పాడైన ఉత్పత్తులు స్వాధీనం

వరంగల్ చౌరస్తా : కాశిబుగ్గ సమీపంలో నిషేధిత రసాయనాలు వినియోగిస్తూ నాణ్యత, పరిశుభ్రత పాటించకుండా పచ్చళ్లు తయారీ చేస్తున్న వాసు పికిల్స్, నీలకంఠ పికిల్స్ కంపెనీలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ జి . బాబులాల్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. వాసు పికిల్స్ కంపెనీ ఎలాంటి అనుమతులు (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లేకుండా పచ్చళ్లు తయారీ చేస్తున్నారు. శుభ్రత లేకుండా నిషేధిత రసాయనాలతో పచ్చళ్లు తయారీ చేస్తూ పాడైపోయినా అమ్మకానికి పెడుతున్నారని టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. పాడైపోయినా నిల్వచేసిన వాసు పికిల్స్ కంపెనీ నుంచి 5 రకాల సుమారు రూ. 10.49 లక్షల విలువైన పచ్చళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఈ కంపెనీని అరుకల శ్రీనివాస్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నారన్నారు. అలాగే, నీలకంఠ పికిల్స్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్ మార్త శంకర్ నుంచి 5 రకాల సుమారు రూ. 7.80లక్షలు.. మొత్తం రూ.18,29,267 విలువైన పాడైన పచ్చళ్ల ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని ఇంతేజార్‌గంజ్ పోలీసులకు కేసు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు వెల్లడించారు.

ఫైనాన్స్ వ్యాపారి దారుణ హత్య

- కాజీపేట రైల్వే క్వార్టర్స్‌లో ఘటన
- హత్యకు గల కారణాలపై పోలీసుల ఆరా
- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు?

కాజీపేట: ఓ ఫైనాన్స్ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి కాజీపేట రైల్వే క్వార్టర్స్‌లో జరిగింది. మృతుడి భార్య మాధవి, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జేపీఎన్ రోడ్డుకు చెందిన త్రిపురాధి నవీన్‌కుమార్ (55) ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా కాజీపేటలోని చిరువ్యాపారులు, రైల్వే, ఎఫ్‌సీఐ, ప్రైవేట్ ఉద్యోగులకు వడ్డీలకు డబ్బులు ఇస్తున్నాడు. ఈ క్రమంలో రైల్వే ఈఎల్ఎస్ షెడ్‌లో పనిచేసే గద్దం ప్రవీణ్‌కుమార్‌కు ఆరు నెలల క్రితం రూ.50 వేలు అప్పుగా ఇచ్చాడు. అప్పు తీసుకున్నప్పటి నుంచి ప్రవీణ్‌కుమార్ అసలుతోపాటు వడ్డీ కూడా చెల్లించకపోవడంతో మృతుడు కొద్దికాలంగా ప్రవీణ్‌కుమార్‌పై ఒత్తిడి పెంచడంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు పెరిగాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి నవీన్‌కుమార్ రైల్వే క్వార్టర్స్‌కు వెళ్లి నిందితుడు ప్రవీణ్‌కుమార్‌ను నిలదీయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగింది. ఆ తర్వాత గొడవ సద్దుమణగడంతో ఇద్దరు కలిసి మద్యం సేవించారు. అయితే డబ్బుల విషయంలో జరిగిన గొడవను మనసులో పెట్టుకున్న ప్రవీణ్‌కుమార్.. కూరగాయలు కోసే కత్తితో విచక్షణారహితంగా పొడవడంతో నవీన్‌కుమార్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. అనంతరం నిందితుడు నేరుగా కాజీపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం.

హత్య కేసులో విభిన్న వాదనలు ..

ఫైనాన్స్ వ్యాపారి నవీన్‌కుమార్ హత్యపై విభిన్న వాదనలు వినిపిస్తున్నాయి. అప్పులు ఇచ్చిన తర్వాత అధిక మొత్తంలో వడ్డీలు వసూలు



నవీన్‌కుమార్ (ఫైల్)



హత్యకు ఉపయోగించిన కత్తి

చేయడం, చెక్ బౌన్స్ కేసులు నమోదు చేయించడం, ఇళ్లు, స్థలాలు రాయించుకోవడం వంటి పనులు చేస్తుండేవాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, నవీన్‌కుమార్‌ను నిందితుడు ప్రవీణ్‌కుమార్ మధ్యాహ్నమే రైల్వే క్వార్టర్‌లో చంపి మృతదేహాన్ని బయటపడేయడం కోసం ప్రయత్నించగా ఆటో డ్రైవర్లు ఎవరూ సహకరించకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో పోలీసులకు నిందితుడు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాగా, ఫైనాన్స్ వ్యాపారి నవీన్‌కుమార్ హత్య సమాచారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఘటనా స్థలికి పోలీసు అధికారులు..

కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి, ఇన్‌చార్జ్ సీఐ పుల్యాల కిషన్‌తో పాటు టాస్క్‌ఫోర్స్, క్రైమ్ సిబ్బంది, క్లూస్ టీం బృందం ఘటనాస్థలిని సందర్శించి ఆధారాలు సేకరించారు. నవీన్‌కుమార్ హత్య వెనుక నిందితుడితో పాటు ఇంకా ఎవరైనా ఉన్నారా? లేక ఒక్కడే హత్య చేసి ఉంటాడా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. కాజీపేట చౌరస్తా నుంచి రైల్వే క్వార్టర్స్‌కు వెళ్లే రహదారుల్లో ఉన్న సీసీ కెమెరాలను జల్లెడ పడుతున్నారు. మృతుడి భార్య త్రిపురాధి మాధవి ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. కాగా, తన భర్త ఒంటిపైనుంచి రూ. 6 లక్షల విలువైన బంగారు ఆభరణాలు నిందితుడు ప్రవీణ్‌కుమార్ తీసుకున్నాడని మృతుడి భార్య మాధవి ఆరోపించింది.

సమ్మక్క సాగర్‌కు జలకళ..

- ఎగువ నుంచి బ్యారేజీలోకి 21,500 క్యూసెక్కుల నీరు చేరిక
- మూడు గేట్లు ఎత్తి 27,000 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామం వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ జలకళ సంతరించుకుంది. కొన్ని రోజుల నుంచి బ్యారేజీలో నీరులేక పోవడంతో బోసిపోయిన గోదావరి.. వారం రోజుల నుంచి ఎగువన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు భారీగా నీరు చేరడంతో గోదావరి నిండుగా ప్రవహిస్తోంది. దీంతో బ్యారేజీలోకి ఎగువ నుంచి 21,500 క్యూసెక్కుల నీరు చేరడంతో అధికారులు బ్యారేజీ వద్ద 59 గేట్లలో మూడు గేట్లు ఎత్తి 27,000 క్యూసెక్కుల



నీటితో కళకళలాడుతున్న సమ్మక్క సాగర్ బ్యారేజీ

నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ సామర్థ్యం 6.94 టీఎంసీలకు గాను ప్రస్తుతం 3.81టీఎంసీల నీరు ఉంది. బ్యారేజీ నీటి మట్టం 83 మీటర్లకు గాను 79.50 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది. కాగా, దేవాదుల వద్ద ఉన్న చొక్కారావు ఎత్తిపోతల నుంచి రెండు మోటార్ల ద్వారా 494 క్యూసెక్కుల నీరు ఎత్తిపోస్తున్నట్లు డీఈ శరత్ బాబు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో దొంగ అరెస్ట్

- రూ. 2.86 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ జీఆర్పీ సీఐ సురేందర్

రామన్నపేట : వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఓ దొంగను అదుపులోకి తీసుకుని అతడి నుంచి రూ. 2,86,645 విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ జీఆర్పీ సీఐ సురేందర్ తెలిపారు. జీఆర్పీ సీఐ కథనం ప్రకారం.. శనివారం ఉదయం 9 గంటల సమయంలో నాలుగో ఫ్లాట్‌ఫామ్ వద్ద చింతల్ వైపున తనిఖీలు చేస్తుండగా మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం బంగ్లా తండాకు చెందిన ఇస్లావత్ సురేశ్ అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించాడు. దీంతో అతడిని తనిఖీ చేయగా 28.645 గ్రాముల బంగారం చైన్, రెండు పుస్తెలు, 3 జతల చెవి





వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ సీఐ సురేందర్

కమ్మలు లభ్యమయ్యాయి. నిందితుడు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో బంగారం చోరీ చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. దీంతో అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తునట్లు జీఆర్పీ సీఐ తెలిపారు. కాగా, నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బంది రాము, రియాజుద్దీన్, నాగరాజు, రామకృష్ణ, రమేశ్. మనోజ్‌కుమార్‌ను జీఆర్పీ సీఐ అభినందించారు.

పక్కా వంద సీట్లు.. సర్వేలన్నీ మనవైపే

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హసన్‌పర్తి: వచ్చే ఎన్నికల్లో పక్కాగా వంద అసెంబ్లీ స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బీఆర్ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నగరంలోని నాని గార్డెన్‌లో శనివారం జరిగింది. సమావేశానికి మాజీ మంత్రి దయాకర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్వేలన్నీ గులాబీ వైపు చూపుతున్నాయని తెలిపారు. గత ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులకు కనీసం సాగు నీరు అందించకుండా వారి కళ్లల్లో కన్నీళ్లు నిలిపిందన్నారు. నాట్లకి..నాట్లకి రైతుబంధు కేసీఆర్ వేస్తే.. రేవంత్ మాత్రం ఓట్లకు ఓట్లకు రైతు భరోసా వేస్తున్నాడని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి ఓ అబద్ధాల కోరుగా అభివర్ణించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, మొట్టు శ్రీనివాస్, కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్‌రావు, రాధికారెడ్డి, నాయకులు శ్రీధర్, అటికం రవీందర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మార్గం భిక్షపతి, అప్పారావు, బండి రజనీకుమార్, తూర్ల కుమారస్వామి, కందుకూరి చంద్రమోహన్, పాడి మల్లారెడ్డి, నద్దునూరి నాగరాజు, జోరుక రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దయాకర్‌రావు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ Hyd అవుట్‌కట్స్, ఓపెన్‌ప్లాట్స్, ల్యాండ్స్ అమ్మబడును/కొనబడును,యాదాద్రి, శంషాబాద్, షాద్‌నగర్, క్లియర్/నాన్ క్లియర్/ఫైనాన్స్ ఇప్పించబడును. 8897666388. [SCA25005655]

TO-LET

■ వరంగల్ హంటర్ రోడ్, సంతోషి మాత గుడి వెనుకాల 1BHK ఇండిపెండెంట్ హౌస్ కిరాయికి ఇవ్వబడును. సంప్ర।। 9849713398 [SCA25005658]

PLOT FOR SALE

■ 800 Sq. yards plot at Supriya Cold storage, Gorrekuntta, Warangal. 170 Sq. yards at Venkatadri nagar, Direct Party Kazipet. Ph: 93987 83805. [M-13605]

■ గుడ్ న్యూస్. జనగామ దగ్గర్లో వడిచెర్లలో ఫామ్‌ల్యాండ్ లాంచింగ్ ఆఫర్లో గు।। 1999/- & RRR HMDA లిమిట్స్ చీమల కొండూరులో తక్కువ రేటుకే. 6304914366 [SCA25005221]

LAND FOR SALE

■ న్యూ శాయంపేట శివారులో క్లియర్ టైటిల్ కలిగిన 15 గుంటల వ్యవసాయ భూమి అమ్మబడును. సంప్ర।। సెల్ నెం: 9963239085 [SCA25005722]

SERVICES

■ పద్మావతి ఫైనాన్స్: హౌసింగ్ బిజినెస్ మార్టిగేజ్ పర్సనల్ ఓపెన్ ప్లాట్స్ పై రుణాలు ఇప్పించబడును. IT రిటర్న్స్ GST లైసెన్స్ చేయబడును. WGL. 9618767116. [SCA25005682]

శ్రీ రాజరాజేశ్వర హోమియో క్లినిక్

■ ఎంతటి అసాధ్యమైన వ్యాధులకైనను హోమియో వ్యాధుల చికిత్సకై సంప్ర।। 36 సం।।ల Exp. డా।। Ch. జితేందర్ BHMS శ్రీ రాజరాజేశ్వర హోమియో క్లినిక్. Opp: న్యూ బస్టాండ్, హన్మకొండ. 9849117394 [WA-7570]

LOANS

■ శివబాలాజీ లోన్స్: స్లాబు, పెంకుటిల్లు, రేకుల కప్పు, అగ్రికల్చర్ లోన్స్, అన్నిరకాల వ్యాపారులకు లోన్స్, భవన నిర్మాణ కార్మికులకు Topup లోన్స్, సిబిల్ లేకున్న, సిబిల్ బ్యాడ్ వున్న లోన్స్ ఇవ్వబడును. వరంగల్- 8522825358. [WA-6722]

CHANGE OF NAME

■ I, AAISHA ZAREEN (Old name), H.No. 18-1-45, Rangashaipet, Khila Warangal (Mdl), Warangal Dist. T.G. I have changed my name from AAISHA ZAREEN (Old name) to AYESHA ZAREEN (New Name) for all purpose. [SCA25005719]

సిరి అసోసియేట్స్

■ సిరి అసోసియేట్స్: హౌస్, మార్టిగేజ్, పర్సనల్, ఓపెన్ ప్లాట్స్, రేకుల & గూన పెంకు ఇళ్లపై సిబిల్ లేకున్నా రుణాలు ఇప్పించబడును. సెల్: 9666142226. [SCA25005069]

BUSINESS OFFER

■ అధిక సంపాదన కోసం ఎదురు చూస్తున్నారా! మీ సొంత ఇంటర్నేషనల్ క్యాపిటల్ మార్కెట్ ట్రేడింగ్ అకౌంట్లో సంపాదించండి. ప్రాఫిట్ షేరింగ్ ఫిక్స్‌డ్ రిటర్న్ సేఫ్ & సెక్యూర్. సంప్ర: 6301859174. [SCA25005424]

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం ముత్తుట్, మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9389214214. [H-783418]

WANTED

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No.1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవ వంట / ఇంటిపని బేబీకేర్కై M/F వర్కర్స్ కావలెను. భో+వ+జీ: 16-18 వేలు. 9515119570, 9553461177. [SCA25005422]

■ రామప్ప జూనియర్ కళాశాల నందు వార్డెన్‌గా పనిచేయుటకు డిగ్రీ పూర్తి చేసిన యువకులు కావలెను. జీతం: 10 వేల నుండి 15 వేల వరకు, ఉచిత భోజనం మరియు వసతి కల్పించబడును. సంప్ర।। 9000471451, 7416936037. [WA-36]

■ Females good at English for Schools as Spoken Eng Trainers Free Training Sal: 20-30k/-pm Ph: 8919641609 [SCA25005680]

WANTED TEACHERS

■ LKG to 7th: English, Maths, Science, Music (Vocal) Dance (Classical), Drawing & Craft, Calligraphy (Hand Writing). Note: Send your applications through Whatsapp No:9989197401, Shantiniketan High School, Near Durgeshwara Swamy Temple, Warangal. [WA-17733]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ।। 260/- అదనపు లైను రూ।। 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఒంటరివాడినయ్యాననే మనస్తాపంతో..

- యువకుడి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి



ప్రశాంత్ (ఫైల్)

గార్ల: ఒంటరి వాడినయ్యాననే మనస్తాపంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు.. పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన గార్ల మండల కేంద్రంలోని కొలిమికొట్టం బజారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొలిమికొట్టం బజారుకు చెందిన రుద్ర ప్రశాంత్ (22) చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయారు. అమ్మమ్మ ఉపేంద్రమ్మ వద్ద పెరిగి ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గతేడాది అమ్మమ్మ కూడా చనిపోవడంతో హైదరాబాద్‌లో పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈనెల 15న అమ్మమ్మ సంవత్సరీకం సందర్భంగా గార్ల వచ్చాడు. బంధువులతో కలిసి కార్యక్రమం పూర్తి చేశాడు. బంధువులందరూ వెళ్లిపోయాక ఒంటరిగా ఉన్నాడు. అమ్మ, నాన్న, అమ్మమ్మ చనిపోయారని, దీంతో ఒంటరిగా ఉంటున్నానని మనస్తాపం చెంది ఈనెల 18న పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి అన్న జశ్వంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు.

డోర్నకల్‌లో విషాదం

- కర్ణాటకలో గ్రామ యువకుడి అనుమానాస్పద మృతి



రాజ్‌కుమార్(ఫైల్)

డోర్నకల్: డోర్నకల్‌లో విషాదం నెలకొంది. స్థానిక బంకట్‌సింగ్‌తండాకు చెందిన ఓ యువకుడు కర్ణాటకలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తండాకు చెందిన ఆర్పీఎఫ్ ఎస్సై జాటోత్ సామ్యేల్ దేవరాజ్ కుమారుడు రాజ్‌కుమార్(26) కర్ణాటకలోని బెల్గావి జిల్లా కాగర్‌వాట్‌లోని సెంట్రల్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తూ బెల్గావిలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 26న ఉదయం తన గదిలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని మార్చురీలో భద్రపర్చి కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు. కుటుంబ సభ్యులు శనివారం రాజ్‌కుమార్ మృతదేహాన్ని డోర్నకల్‌కు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఉన్నత ఉద్యోగం చేస్తూ అందరితో కలిసి ఉండే రాజ్‌కుమార్ మృతితో స్థానికంగా విషాదం అలుముకుంది.

వరంగల్ పోలీస్ శిక్షణ కళాశాలలోని వస్తువుల వేలం

హన్మకొండ కల్చరల్ : వరంగల్ మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలోని వాడకోవడానికి పనిరాని వస్తువులను, పాతవస్తువులను విక్రయించేందుకు వేలం వేస్తున్నామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల కొనుగోలుదారులు వారి ఆధార్‌కార్డుతో జూలై 7న ఉదయం 10.30గంటలకు కళాశాలలో నిర్వహించే వేలంపాటకు హాజరు కావాలని సూచించారు. ఉపయోగంలో లేని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, ఇనుపసామన్లు, టెంట్లు, ప్లాస్టిక్, ఇతర వస్తువులు వేలం వేస్తున్నట్లు వివరించారు. వివరాల కోసం 87125 97562, 96403 33445 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బడికిపోయినా బతికేటోడు..

- ట్రాక్టర్ రోటోవేటర్ కిందపడి బాలుడి దుర్మరణం
- రాజులకొత్తపల్లిలో ఘటన
- మిన్నంటిన కుటుంబికుల రోదనలు



వరుణ్ (ఫైల్)

నెల్లికుదురు : పాపం చిన్నారి.. బడికి పోయినా బతికేటోడు. వ్యవసాయ బావి దగ్గరికి వెళ్దాం ఈ రోజు పాఠశాలకు వెళ్లకండి అని తండ్రి చెప్పడంతో ముగ్గురు చిన్నారులు ఎగిరి గంతేశారు. తల్లిదండ్రితోపాటు ట్రాక్టర్‌లో వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. అక్కడ తండ్రి వ్యవసాయ భూమి దున్నుతుండగా సరదాగా ముగ్గురు చిన్నారులు ట్రాక్టర్‌పై ఎక్కారు. ఇందులో ఓ చిన్నారి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ రోటోవేటర్ కిందపడి దుర్మరణం చెందాడు. దీంతో బడికి పోయినా బతికిటోడివి బిడ్డో అంటూ తల్లిదండ్రులు తమ కుమారుడి మృతదేహం మీద పడి గుండెలవిసేలా రోదించారు. ఈ ఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రాజులకొత్తపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఇన్‌చార్జ్ ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జిలుకర ప్రసాద్, స్వర్ణ దంపతులకు కూతురు సౌమ్య, ఇద్దరు కుమారులు సందీప్, వరుణ్(07) ఉన్నారు. ఈ క్రమంలో ముగ్గురు పిల్లలు, భార్యను ట్రాక్టర్‌పై ఎక్కించుకున్న ప్రసాద్. తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. అక్కడ ట్రాక్టర్‌పై నుంచి స్వర్ణ దిగింది. పిల్లలు వరుణ్, సౌమ్య, సందీప్ ట్రాక్టర్‌పై కూర్చోపెట్టుకుని తండ్రి వ్యవసాయ భూమి దున్నుతుండగా పిల్లలు కేరింతలు కొడుతూ ఎంజాయ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా వరుణ్ ట్రాక్టర్ పైనుంచి జారి దున్నుతున్న రోటో వేటర్ కింద పడ్డాడు. దీంతో నాన్న.. తమ్ముడు పడిపోయాడు అని మిగతా ఇద్దరు పిల్లలు అరుస్తుండగా ట్రాక్టర్ నిలిపి తండ్రి వెళ్లి చూడగా అప్పటికే వరుణ్ దుర్మరణం చెందాడు. రోటోవేటర్ కింద పడి ఆ చిన్నారి మృతదేహం నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదం తమ కళ్లెదుటే జరుగడంతో ఆ కుటుంబం మొత్తం గుండెలవిసేలా రోదించింది. ఈ ఘటనపై బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్సై శివరామకృష్ణ తెలిపారు. కాగా, వరుణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వినోదానికి వస్తూ విషాదం..

- గేదెలను తప్పించబోయి అదుపు తప్పిన బైక్..
- ఓ యువకుడు మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- మరిపెడ మండలం గిరిపురం క్రాస్ సమీపంలో ఘటన
- సూర్యాపేట జిల్లా బిక్కుమళ్ల గ్రామస్తులుగా గుర్తింపు

మరిపెడ రూరల్: సినిమా చూడడానికి ముగ్గురు మిత్రులు ఒకే బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో గేదెలను తప్పించబోయి బైక్ అదుపు తప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గిరిపురం క్రాస్ సమీపంలోని పత్తి మిల్లు వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం బిక్కుమల్ల గ్రామానికి చెందిన గజేంద్రి గణేశ్ (23), కుక్కల గణేశ్, బాల్ని గణేశ్ స్నేహితులు. సినిమా చూడడానికి ముగ్గురు ఒకే బైక్‌పై మరిపెడ మండల కేంద్రానికి వస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని గిరిపురం క్రాస్ సమీపంలోని పత్తి మిల్లు వద్ద గేదెల మంద ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చింది. వాటిని తప్పించబోయి బైక్ అదుపు తప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న గజేంద్రి గణేశ్‌తోపాటు మిగతా ఇద్దరికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా గజేంద్రి గణేశ్ మార్గమధ్యలో మృతి చెందాడు. మిగతా ఇద్దరు చికిత్స పొందుతున్నారు. మృతుడి తల్లి సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గజేంద్రి గణేశ్ (ఫైల్)